అండర్సన్ అల్విదా!

రిటైర్మెంట్ ప్రకటించిన పేస్ బిగ్గజం • లార్డ్స్‌లో చివరి టెస్టు ఆడనున్న జిమ్మీ

లండన్: రెండు దశాబ్దాల అంతర్జాతీయ క్రికెట్‌కు ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలింగ్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ వీడ్కోలు ప్రకటించాడు. నాలుగు పదుల (41 ఏండ్లు) వయసులోనూ యువ పేసర్లకు దీటుగా బౌలింగ్ చేస్తున్న జిమ్మీ (అండర్సన్ ముద్దుపేరు) జులైలో వెస్టిండీస్‌తో లార్డ్స్ వేదికగా జరుగబోయే మొదటి టెస్టు తన కెరీర్‌లో చివరి మ్యాచ్ అని స్పష్టం చేశాడు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా అండర్సన్ స్పందిస్తూ.. 'చిన్ననాటి నుంచి నేను ఎంతో ఇష్టపడిన ఆటలో 20 ఏండ్ల పాటు నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం అద్భుతం. కానీ నేను వీడ్కోలు పలకడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నా. నాలాగే ఇతరులూ వారి కలను సాకారం చేసుకోవడం చాలా గొప్ప ఫీలింగ్' అని రాసుకొచ్చాడు. ఈ సందర్భంగా అండర్సన్ తన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో పాటు సహచర ఆటగాళ్లకు కృతజ్ఞతలు తెలిపాడు. 2002లో వన్డే అరంగేట్రం చేసినా 2003లో జింబాబ్వేతో టెస్టు ద్వారా లార్డ్స్‌లోనే తన కెరీర్‌కు శ్రీకారం చుట్టిన అండర్సన్.. 21 ఏండ్ల తర్వాత అదే వేదికపై తన ఆఖరి మ్యాచ్ ఆడనుండటం గమనార్హం. సచిన్ (200 టెస్టులు) తర్వాత ఈ ఫార్మాట్‌లో అత్యధిక మ్యాచ్‌లు (187) ఆడిన ఇంగ్లండ్ దిగ్గజం.. 700 వికెట్లు పడగొట్టాడు. టెస్టులలో మురళీధరన్ (800), వార్న్ (708) తర్వాత అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అతడే కాగా పేసర్లలో అతడిదే అగ్రస్థానం.

అండర్సన్ గణాంకాలు

మ్యాచ్‌లు	వికెట్లు
187 (టెస్టులు)	700
194 (వన్డేలు)	269
19 (టీ20)	18

ఢిల్లీకి షాక్.. కీలక మ్యాచ్‌కు పంత్ దూరం

ఢిల్లీ: ఐపీఎల్-17 ప్లేఆఫ్స్ రేసులో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆదివారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో కీలక మ్యాచ్ ఆడనున్న వేళ ఆ జట్టుకు భారీ షాక్ తగిలింది. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో 'స్లో ఓవర్ రేట్' కారణంగా ఢిల్లీ సారథి రిషభ్ పంత్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధిస్తున్నట్టు ఐపీఎల్ పాలకమండలి తెలిపింది. దీంతో అతడు బెంగళూరుతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఈ సీజన్‌లో చెన్నై, కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లలోనూ పంత్ ఇదే కారణంతో జరిమానా ఎదుర్కోగా రాజస్థాన్‌తోనూ అదే పునరావృతమవడంతో అతడిపై ఒక మ్యాచ్ నిషేధంతో పాటు రూ. 30 లక్షల జరిమానా పడింది. పంత్‌కే గాక ఢిల్లీ తుది జట్టులో ఉన్న ఆటగాళ్లకు (ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా) ఒక్కొక్కరికి రూ. 12 లక్షల జరిమానా లేదా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పడింది.

'గ్రామీణ క్రికెటర్లను ఐపీఎల్‌లో చూడాలన్నదే మా కల'

కరీంనగర్: అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లు ప్రాతినిధ్యం వహించే ఐపీఎల్ వంటి మెగా లీగ్‌లో తెలంగాణ గ్రామీణ క్రికెటర్లను చూడాలన్నదే తమ ఆకాంక్ష అని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న హెచ్‌సీఏ సమ్మర్ క్యాంపులలో భాగంగా శనివారం ఆయన కరీంనగర్‌లోని శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల స్థాయిలో మెరికల్లాంటి క్రికెటర్లను వెలికితీస్తామని, ఇందులో భాగంగానే రూ. 1.50 కోట్లు ఖర్చు చేసి సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని అన్నారు. త్వరలోనే ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ప్లేఆఫ్స్‌కు కేకేఆర్

ముంబైని చిత్తు చేసిన నైట్ రైడర్స్

రాణించిన వెంకటేశ్, నితీశ్ • ఛేదనలో చేతులెత్తేసిన హార్దిక్ సేన

ఈ సీజన్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) శనివారం సొంత ఇలాఖాలో ముంబై ఇండియన్స్‌ను ఓడించి ఐపీఎల్-17లో ప్లేఆఫ్స్ చేరిన తొలి జట్టుగా నిలిచింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముగిసిన మ్యాచ్‌లో సమిష్టిగా రాణించి తొమ్మిదో విజయంతో ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో మొదట వెంకటేశ్, నితీశ్ దూకుడుతో భారీ స్కోరు చేసిన కేకేఆర్.. ఆ తర్వాత బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో ముంబైని చిత్తుచేసింది.

రస్సెల్ (24, 2/34)

కోల్‌కతా: ఐపీఎల్-17లో వరుస విజయాలతో దూకుడు మీదున్న కోల్‌కతా నైట్ రైడర్స్ ఈ సీజన్‌లో ప్లేఆఫ్స్ బెర్తును దక్కించుకున్న తొలి జట్టుగా నిలిచింది. శనివారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ సేనను 18 పరుగుల తేడాతో ఓడించడంతో కేకేఆర్.. 2021 తర్వాత మళ్లీ నాకౌట్ దశకు చేరుకుంది. వర్షం అంతరాయం వల్ల 16 ఓవర్లకే కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (21 బంతుల్లో 42, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), నితీశ్ రాణా (23 బంతుల్లో 33, 4 ఫోర్లు, 1 సిక్సర్) రాణించారు. అనంతరం ఛేదనకు దిగిన ముంబై.. 16 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 139 పరుగులకే పరిమితమై ఈ సీజన్‌లో 9వ ఓటమిని మూటగట్టుకుంది. ఇషాన్ కిషన్ (22 బంతుల్లో 40, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), తిలక్ వర్మ (17 బంతుల్లో 32, 5 ఫోర్లు, 1 సిక్సర్) ఫర్వాలేదనిపించారు. వరుణ్ చక్రవర్తికి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

కేకేఆర్ దూకుడు

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతాకు ఓపెనర్లు సాల్ట్ (6), నరైన్ (0) ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. కేకేఆర్ ఇన్నింగ్స్ తొలి బంతికే సిక్సర్ కొట్టిన సాల్ట్.. మొదటి ఓవర్లోనే భారీ షాట్ ఆడి కంబోజి చేతికి చిక్కాడు. నరైన్‌ను అద్భుత బంతితో బుమ్రా బోల్తా కట్టించాడు. కంబోజ్ వేసిన ఐదో ఓవర్లో తొలి బంతి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (7) బౌల్డ్ చేసి కేకేఆర్‌కు షాకిచ్చాడు. కానీ ముంబై అంటేనే విరుచుకుపడే వెంకటేశ్ అయ్యర్ ఆ జట్టు బౌలర్లపై విరుచుకుపడ్డాడు. నితీశ్ రాణా అండతో కేకేఆర్ ఇన్నింగ్స్‌ను గాడినపెట్టాడు. హాఫ్ సెంచరీకి చేరువైన వెంకటేశ్‌ను చావ్లా ఔట్ చేయగా రాణాను తిలక వర్మ రనౌట్ చేశాడు. ఉన్నంతసేపు రస్సెల్ (24) మెరుపులు మెరిపించాడు. ఆఖర్లో రింకూ సింగ్ (20), రమణ్‌దీప్ (17 నాటౌట్) మెరుపులతో కేకేఆర్ భారీ స్కోరు సాధించింది.

ముంబైది అదే కథ

ఛేదనలో ముంబై ఆదినుంచే కోల్‌కతా బౌలర్లపై ఎదురుదాడికి దిగినా తర్వాత తడబడింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్, రోహిత్ శర్మ (19) ధాటిగా ఆడారు. హర్షిత్ రాణా 4వ ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో దూకుడుగా ఆడిన ఇషాన్.. నరైన్ 5వ ఓవర్లో 4,6 తో రెచ్చిపోయాడు. కానీ అతడే వేసిన ఏడో ఓవర్లో ఇషాన్.. రింకూ సింగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రోహిత్‌ను చక్రవర్తి ఔట్ చేశాడు. ఇక అక్కడ్నుంచి ముంబై వేగంగా వికెట్లు కోల్పోయింది.ఆ జట్టు భారీ ఆశలు పెట్టుకున్న సూర్యకుమార్ యాదవ్ (11)ను ఆండ్రీ రస్సెల్ వెనక్కి పంపాడు. హార్దిక్ పాండ్యా (2), టిమ్ డేవిడ్ (0), నెహల్ వధెరా (3) విఫలమవడంతో ముంబైకి ఓటమి తప్పలేదు.

వెంకటేశ్ అయ్యర్ (42)

సంక్షిప్త స్కోర్లు

కోల్‌కతా: 16 ఓవర్లలో 157/7 (వెంకటేశ్ 42, నితీశ్ 33, చావ్లా 2/28, బుమ్రా 2/39)

ముంబై: 16 ఓవర్లలో 139/8 (ఇషాన్ 40, తిలక్ 32, వరుణ్ 2/17, రస్సెల్ 2/34)

రెండు దఫాలుగా రంజీ

దేశవాళీ క్రికెట్‌లో సంస్కరణలు

ముంబై: దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్టాత్మక రంజీ సీజన్‌ను ఇకనుంచి రెండు దశలుగా నిర్వహించనున్నట్టు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తెలిపింది. 2024-25 సీజన్‌కు సంబంధించిన షెడ్యూల్ ఇంకా వెలువడనప్పటికీ రంజీ ట్రోఫీని రెండు దశల్లో ఆడించాలని బీసీసీఐ ప్రతిపాదించింది. ఇదే విషయమై బీసీసీఐ కార్యదర్శి జై షా ఓ ప్రకటనలో.. 'దులీప్ ట్రోఫీతో సీజన్ మొదలవుతుంది. ఆ తర్వాత ఇరానీ కప్ జరుగనుంది. అనంతరం రంజీ ట్రోఫీ లో భాగంగా ప్రతి జట్టు తమ తొలి ఐదు లీగ్ గేమ్స్‌ను ఆడతాయి. అవి ముగిశాక సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే టోర్నీ ఉంటుంది. చివర్లో మళ్లీ రంజీ రెండో దశను నిర్వహించేందుకు ప్రతిపాదించాం' అని పేర్కొన్నాడు. దీనికి బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ ఆమోదముద్ర వేయాల్సి ఉంది. సీకే నాయుడు ట్రోఫీలో టాస్‌ను ఉపయోగించకుండా పర్యాటక జట్టు అభీష్టం మేరకు మ్యాచ్‌లను నిర్వహించనున్నట్టు ప్రతిపాదించింది.

జొకో తలకు గాయం

రోమ్: ఇటాలియన్ ఓపెన్‌లో ఆడుతున్న టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ తలకు స్వల్ప గాయమైంది. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో జొకో.. 6-3, 6-1 తేడాతో కొరెంటిన్ (ఫ్రెంచ్) ను ఓడించిన అనంతరం గ్యాలరీలో ఉన్న ఓ అభిమానికి ఆటోగ్రాఫ్ ఇచ్చేందుకు వెళ్లాడు. ఇదే సమయంలో సదరు అభిమాని బ్యాగ్‌లో ఉన్న వాటర్ బాటిల్ ప్రమాదవశాత్తూ జొకో తలకు బలంగా తగలడంతో అతడు అక్కడే కూలబడిపోయాడు. ఇక మ్యాచ్ ముగిశాక బయటకు వచ్చిన జొకో తలకు హెల్మెట్‌తో రావడం గమనార్హం.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
కోల్‌కతా	12	9	3	+1.42	18
రాజస్థాన్	11	8	3	0.47	16
హైదరాబాద్	12	7	5	0.40	14
చెన్నై	12	6	6	+0.49	12
ఢిల్లీ	12	6	6	-0.31	12
లక్నో	12	6	6	-0.76	12
బెంగళూరు	12	5	7	+0.21	10
గుజరాత్	12	5	7	-1.06	10
ముంబై	13	4	9	-0.27	8
పంజాబ్	12	4	8	-0.42	8

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

బ్లిట్జ్‌లోనూ నిరాశే

వార్సా: సూపర్‌బెట్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు నిరాశపరుస్తున్నారు. ర్యాపిడ్ రౌండ్లలో తేలిపోయిన మన కుర్రాళ్లు బ్లిట్జ్‌లోనూ తడబడుతున్నారు. శనివారం కూడా నిరాశపరిచారు. 9 రౌండ్లు ముగిసిన బ్లిట్జ్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఐదు విజయాలు, రెండు డ్రా, రెండు ఓటములతో ఫర్వాలేదనిపించాడు. కానీ గుకేశ్ ఐదు గేమ్‌లలో ఓడి మూడు గెలిచి ఒకటి డ్రా చేసుకున్నాడు. ప్రజ్ఞానంద నాలుగింటిలో గెలిచి ఒక గేమ్‌ను డ్రా చేసుకుని నాలుగు ఓడిపోయాడు. రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద.. మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించాడు.

అమన్‌కు పారిస్ టికెట్

భారత్ తరపున తొలి పురుష రెజ్లర్

ఇస్తాంబుల్: వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా శనివారం జరిగిన ఫ్రీ స్టయిల్ విభాగంలో భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ అదరగొట్టాడు. ఇస్తాంబుల్ (టర్కీ) వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో అమన్ సెహ్రావత్ (57 కిలోలు).. సెమీస్‌లో 12-2 తేడాతో ఉత్తరకొరియాకు చెందిన చోంగ్‌సంగ్ హ్యూన్‌ను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించాడు. దీంతో ఒలింపిక్స్ రెజ్లింగ్ పురుషుల కేటగిరీలో భారత్‌కు తొలి బెర్తు ఖాయమైంది. 65 కిలోల విభాగంలో సుజీత్ కల్కల్.. సెమీస్‌లో 1-6తో ఒచిర్ (మంగోలియా) చేతిలో ఓడాడు. దీపక్ పునియా (86 కిలోలు), సుమిత్ మాలిక్ (125 కిలోలు) తొలి రౌండ్‌లోనే ఓడిపోయి ఇంటి ముఖం పట్టగా జైదీప్ అహ్లావత్ (74 కిలోలు) క్వార్టర్స్‌లో పరాభవం పాలయ్యాడు.

హాంకాంగ్ వేదికగా ముగిసిన జూనియర్ ఆసియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ వెయిట్‌లిఫ్టర్ పిల్లి ఉదయ్ కిరణ్.. పురుషుల 89 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు.

వాణిజ్య

ఐదు రోజులు..16 వేల కోట్లు

ఈక్విటీలో పెట్టుబడులను వెనక్కి తీసుకున్న ఎఫ్ఐఐలు

స్టాక్ మార్కెట్ల భారీ పతనంతో విదేశీ ఇన్వెస్టర్లలో ఆందోళన



- *గడిచిన నెల రోజుల్లో నిఫ్టీ 1.5 శాతం పడిపోయింది. ఇదే సమయంలో షాంఘై కంపోజిట్ 2.62 శాతం అధికమవగా, హ్యాంగ్ సెంగ్ 8.8 శాతం బలపడింది.*
- *ఈ నెలలో జరిగిన ఏడు సెషన్లలో ఆరు రోజులు నష్టపోగా, కేవలం ఒక్క రోజు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి.*
- *ప్రస్తుత నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు మొత్తంగా రూ.22 వేల కోట్లను ఉపసంహరించుకోగా, డీఐఐలు రూ.16,700 కోట్ల నిధులు చొప్పించారు.*

న్యూఢిల్లీ, మే 11: లాభాలతో కళకళలాడిన స్టాక్ మార్కెట్లలో పార్లమెంట్ ఎన్నికలు అలజడిని సృష్టించాయి. ఈసారి ఎన్నికల్లో నరేంద్ర మోదీ సర్కార్ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవంటూ వస్తున్న అంచనాలు సూచీల్లో పెను తుఫాన్ సృష్టించింది. గత నెలలో రికార్డు స్థాయిలో దూసుకుపోయిన సూచీలు ప్రస్తుతం తిరోగమన బాటపట్టాయి. ఈ నెలలో జరిగిన ఎనిమిది ట్రేడింగ్ రోజుల్లో ప్రధాన సూచీ సెన్సెక్స్ ఏకంగా 2 వేల పాయింట్ల స్థాయిలో పడిపోయింది. దీంతో మదుపరుల సంపద అక్షరాల లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. ఈ ఎన్నికల అలజడితో విదేశీ మదుపరుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. గడిచిన ఐదు సెషన్లలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఏకంగా రూ.16 వేల కోట్ల సంపదను వెనక్కి తీసుకున్నారు. ఈ ట్రెండ్ మరికొన్ని రోజులు కొనసాగే ప్రమాదం ఉన్నదని దలాల్‌స్ట్రీట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

రెండు నెలలుగా అదే తీరు

వరుసగా రెండు నెలల్లో ఎఫ్ఐఐలు అమ్మకాల బటన్ నొక్కుతున్నారు. ఏప్రిల్ నెలలో ఏకంగా రూ.35,692 కోట్ల విలువైన పెట్టుబడులను వెనక్కి తీసుకున్న విదేశీ మదుపరులు.. ఇదే ట్రెండ్‌ను ప్రస్తుత నెలలోనూ కొనసాగించారు. కానీ, ఏడాది క్రితం ఇదే నెలలో రూ.44,186 కోట్ల పెట్టుబడులు పెట్టి నట్టు ఎన్ఎస్ఈ నివేదిక వెల్లడించింది. మరోవైపు, ఎఫ్ఐఐలు అమ్మకాలకు మొగ్గుచూపినప్పటికీ దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు(డీఐఐఎస్) మాత్రం కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఈ నెలలో ఏకంగా రూ.11 వేల కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.

ఎఫ్ఐఐలు అమ్మకానికి గల కారణాలు

అమెరికా బాండ్ ఈల్డ్స్: అమెరికా బాండ్ ఈల్డ్స్ రేట్లను పెంచుతూ తీసుకున్న నిర్ణయం. 10 ఏండ్ల కాలపరిమితి కలిగిన బాండ్ ఈల్డ్‌పై రేటు 4.7 శాతానికి సవరించింది. దీంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వీటివైపు మళ్లించారు.

లోక్‌సభ ఎన్నికలు

దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో అనూహ్య రీతిలో పోలింగ్ శాతం తగ్గుతుండడంపట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో బీజేపీ సర్కార్ విజయావకాశాలు సన్నగిల్లే అవకాశం ఉండటం. అత్యధిక మంది పెట్టుబడిదారులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడం కూడా సూచీల పతనానికి కారణం.

చైనా మార్కెట్లు

భారత్ పొరుగు దేశమైన చైనా స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగరడం కూడా ఎఫ్ఐఐలు అమ్మకాలవైపు మొగ్గుచూపారు.

ఎఫ్ఐఐలు అమ్మకాలకు మొగ్గుచూపుతున్నారు. ఎన్నికల ఫలితాల వరకు వేచిచూసే దోరణి అవలంభిస్తుండటంతో డీఐఐలు కొనుగోళ్లకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

- వీకే విజయకుమార్, జియోజిట్ ఫైనాన్షియల్ ప్రెసిడెంట్

సింగిల్ చార్జింగ్‌తో 170 కిలోమీటర్లు

ఐవూమి ప్రత్యేక ఈవీ స్కూటర్

న్యూఢిల్లీ, మే 11: ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ సంస్థ ఐవూమి..దేశీయ మార్కెట్‌కు నయా స్కూటర్ జీత్‌ఎక్స్ జెడ్‌ఈని పరిచయం చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 170 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్ ధరను రూ.80 వేలుగా నిర్ణయించింది. గంటకు 57 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్ బ్యాటరీ 5.5 గంటల్లో పూర్తిస్థాయిలో చార్జింగ్ కానున్నది. 3 కిలోవాట్, 2.1 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో ఈ స్కూటర్లను తీర్చిదిద్దింది సంస్థ. బ్యాటరీపై ఐదేండ్లు లేదా 50 వేల కిలోమీటర్ల వారెంటీని కల్పిస్తున్నది. డిస్క్ బ్రేక్, యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్‌తోపాటు ఇతర ఫీచర్లతో ఈ బైకును తయారు చేసింది. స్మార్ట్‌ఫోన్ కనెక్ట్ చేసుకోవచ్చును, ముఖ్యంగా బ్లూటూత్ కనెక్టివిటీతో ఎస్ఎస్ఎం, కాల్ అలర్ట్‌ను తెలుసుకోవచ్చును.

అంబాసిడర్ కారు మళ్లీ వస్తోంది!

న్యూఢిల్లీ, మే 11: ఒకప్పుడు దేశీయ రోడ్లపై దూసుకుపోయిన అంబాసిడర్ కారు మళ్లీ వస్తోంది. హిందుస్థాన్ మోటర్ సంస్థ ఈ నయా అంబాసిడర్ కారుకు తుది మెరుపులు దిద్దుతున్నది. దేశీయ మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన ఈ మాడల్‌ను దశాబ్దాల క్రితం సంస్థ నిలిపివేసింది. ఆటోమొబైల్ రంగంలోకి ఎన్నో కంపెనీలు ప్రవేశించడం, ఈ పాత మాడల్‌కు ఆదరణ తగ్గిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం ఈ నయా మాడల్‌ను తిరిగి విడుదల చేయడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది. దీంతో పాటు అంబాసిడర్‌లోనే ఈవీని ప్రవేశపెట్టే ఉద్దేశంలో సంస్థ ఉన్నది. ఇందుకోసం సంస్థ యూరోపియన్‌కు చెందిన కంపెనీతో కలిసి పనిచేస్తున్నది. తొలి దశలో ద్విచక్ర వాహనాన్ని, ఆ తర్వాతి క్రమంలో నాలుగుచక్రాల వాహనాన్ని విడుదల చేయనున్నది. ఇందు కోసం రూ.300-400 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నది.



ఆడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. .ఈ మాడళ్లలో క్యూ3 బోల్డ్ ఎడిషన్ ధర రూ.54.65 లక్షలు కాగా, స్పోర్ట్‌బ్యాక్ బోల్డ్ ఎడిషన్ ధర రూ.55.71 లక్షలుగా నిర్ణయించింది.

స్టార్టప్‌ల్లోకి 320 మిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ, మే 11: దేశీయ స్టార్టప్‌లు నిధుల సేకరణలో దూసుకుపోతున్నాయి. ఈవారంలో 24 దేశీయ స్టార్టప్‌లు ఏకంగా 320 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. వీటిలో ఏడు ఒప్పందాలు ఇప్పటికే కుదరగా, మరో 13 ఒప్పందాలు ప్రారంభ దశలో ఉన్నాయని ఎంట్రాక్ర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ 28 స్టార్టప్‌ల్లోకి 340 మిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. అలాగే ఈ వారంలో జరిగిన ఒప్పందాల్లో ఏడు స్టార్టప్‌ల్లోకి 287 మిలియన్ డాలర్ల ఫండింగ్ సమకూరాయి. వీటిలో డాటా, కృత్రిమ మేధస్సు గవర్నెన్స్ లకు సంబంధించిన స్టార్టప్‌లు అగ్రస్థానంలో ఉన్నాయి. సంస్థల వారీగా చూస్తే అట్లాన్ స్టార్ట్‌ప్‌లోకి అత్యధికంగా 105 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతోపాటు నెఫ్రోప్లస్‌లోకి 105 మిలియన్ డాలర్లు రాగా, గ్రీన్ సెల్ మొబిలిటీలోకి 36.7 మిలియన్ డాలర్లు, కే12 టెక్నో సర్వీసెస్‌లోకి 27 మిలియన్ డాలర్లు, లెండింగ్‌కార్ట్‌లోకి 10 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. అలాగే ప్రారంభ దశలో ఉన్న 13 స్టార్టప్‌లోకి 33 మిలియన్ డాలర్ల ఫండింగ్ జరిగింది. నగరాల వారీగా చూస్తే బెంగళూరుకు చెందిన తొమ్మిది స్టార్టప్‌లోకి అత్యధిక పెట్టుబడులను ఆకర్షించగా..ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్, అహ్మదాబాద్, గాంధీనగర్, ఇండోర్, కోల్‌కతాకు చెందిన పలు స్టార్టప్‌లు ఉన్నాయి.

పర్సెప్టీన్‌లోకి పెట్టుబడులు

హైదరాబాద్ సిటీబ్యూరో: పెట్టుబడులు ఆకట్టుకోవడంలో టీ హబ్ స్టార్టప్‌లు దూసుకుపోతున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి ఫ్యాక్టరీ ఆటోమేషన్ రోబోటిక్ టెక్నాలజీ సేవలు అందిస్తున్న పర్సెప్టీన్ కూడా చేరింది. ప్రారంభ దశలో ఉన్న ఈ స్టార్టప్‌కు పెట్టుబడిదారుల నుంచి ఆశించిన స్థాయిలో నిధులు సమకూరాయని టీ హబ్ నిర్వాహకులు తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా ఇండస్ట్రీయల్ హ్యూమనాయిడ్ రోబోట్‌ను తయారు చేయడమే లక్ష్యంగా చేసుకొని ఈ స్టార్టప్ కార్యకలాపాలను అభివృద్ధి చేస్తున్నది.

ఈ ఏడాది కొత్తగా 300 శాఖలు

యూనియన్ బ్యాంక్ ఎండీ, సీఈవో ఏ మణిమెఖలై

ముంబై, మే 11: ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికానికిగాను ఏడాది ప్రాతిపదికన కన్సాలిడేటెడ్ నికర లాభం 18.36 శాతం వృద్ధితో రూ.3,328 కోట్లు ఆర్జించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో వృద్ధి నమోదైందని బ్యాంక్ ఎండీ, సీఈవో ఏ మణిమెఖలై తెలిపారు. నికర వడ్డీ ఆదాయం 14 శాతం ఎగబాకి రూ.9,437 కోట్లకు చేరింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.13,797 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.3,222 కోట్ల నిధులు వెచ్చించింది. అలాగే కొత్తగా రూ.3,202 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయని ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఆమె చెప్పారు. వ్యాపార విస్తరణలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 250 శాఖల నుంచి 300 శాఖల వరకు దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ఆమె ప్రకటించారు.

17 నుంచి గ్రీన్ ప్రాపర్టీ షో

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో-2024ను నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 17 నుంచి 19 వరకు మూడు రోజులపాటు హైటెక్స్‌లో జరగనున్నదని నిర్వాహకులు తెలిపారు. సుమారు 70కిపైగా గ్రీన్ సర్టిఫైడ్ రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ప్రదర్శించనున్నాయి.

హైదరాబాద్‌లో బ్లూమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్, మే 11: మాడ్యులర్ ఫర్నీచర్ తయారీ సంస్థ బ్లూమ్..తాజాగా హైదరాబాద్ తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. దక్షిణాదిలో తన వ్యాపార విస్తరణలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో